# ఓ శాంతి

## –కౌకాని కమల

ప్రి...మీకు....

నమస్కారం!

జీవితంలో మీ నీడని కూడా ఎప్పుడు చూడకూడదని, చూసినా మాట్లాడ కూడదని నేను నిర్ణయించుకున్నాను.

కాని తిరిగి ఇలాంటి ఉత్తరం వ్రాయాల్సి వచ్చినందుకు ఎంతగానో చింతిస్తున్నాను.

మీరు చట్ట ప్రకారం నాకు ఏనాడైతే "విడాకులు" ఇచ్చారో ఆనాడే మన మధ్య బంధం తెగిపోయిందికదా? ఆక్షణం నుంచి మీరెవరో... నేనెవరో...

"—నేనంటే మీకు అసహ్యం అని, నా ముఖం చూట్టం కూడా మీకు ఇష్టం లేదని, నన్ను చేసుకుని మీరు సుఖపడింది ఏది లేదని, మిమ్మల్ని మా వాళ్ళు మోసం చేసి నన్ను అంటగట్టారని, నా "క్యారక్టరు" మంచిది కాదని..." ఇలాగే ఎన్నో ఆనాడు నాగురించి కోర్టులో పది మంది ఎదట చెప్పారు.

ఆక్షణంలోనే నా అభిమానం చచ్చిపోయింది.

నా మనసు విరిగిపోయింది.

మీ గురించి ఎంతో ఏహ్యాభావం ఏర్పడి పోయింది. సరిగ్గా ఆక్షణంలోనే నిర్ణయించుకున్నాను. జీవితంలో ఇక! ఎన్నడు మీ ముఖం చూడ కూడదని!

గత ఆరు సంవత్సరాలు అలాగే గడిచాయి.

కాని ఈ మధ్య కొన్ని రోజుల్నుంచి మీరు అదే పనిగా నన్ను నీడలా వెంటాడుతున్నారు.

ఎన్నో రకాలుగా నన్ను "హంట్" చేస్తున్నారు

మన పాత రోజుల్ని గుర్తుకి తెస్తున్నారు.

పెళ్ళి—పవిత్రత అంటు ఉపన్యాసాలు ఇస్తున్నారు.

నేను తిరిగి మర్యాదగా మీ దగ్గరకి రాకపోతే నాగురించి చెడుగా ప్రచారం చేస్తానని, మోహన్‌కి నాపై మనసు విరిచి నీ బ్రతుకు నాశనం చేస్తానని బెదిరిస్తున్నారు.

కాని నేను అప్పటి పల్లెటూరి పిరికి శాంతిని కాదు. మీరు కళ్ళెర్ర చేస్తే బెదిరి పోయే బేలత్వం ఇప్పుడు నాలో లేదు. ఇప్పుడు నేను డా. శాంతిని. పరిణీతి చెందిన యువతిని, పైగా మోహన్ మీలా సంకుచితుడు, ఎవరు ఏది చెప్తే అది నమ్మే అవివేకి అసలే కాదు.

ఇన్నాళ్ళు మీరు నన్ను మరిచి పోలేదని, నా నుంచి దూరం అయ్యాక మీరు సుఖ పడింది ఏది లేదని అన్నారు.

నాకు "నవ్వు" వస్తూంది.

మరి అదే నిజమయితే, మీకు నా మీద అంత ప్రేమ వుంటే...మరి నాకు "విడాకులు" ఎందుకు ఇచ్చారు?

అప్పట్లో మీ గరల్ ఫ్రెండ్సు మీకు "మందు" పెట్టారని, దాని ప్రభావమే అప్పటి మీ దుర్వర్తనకి కారణం అని అంటున్నారు.

డబ్బుకోసం ప్రేమ నటించి, మందు పెట్టే గరల్ ఫ్రెండ్స్ ఎప్పుడూ ఏ వేళా అన్ని చోట్లా అన్ని కాలాల్లోనూ వుంటారు.

ఆ మందు ప్రభావానికి లోను కానివాడే "అసలైన మగవాడు. ధీరుడు!

కాని మీరు అల్పులు. దుర్బలులు.

క్షణిక ఆనందం కోసం తుచ్ఛమైన శారీరక అవసరాల కోసం మత్తుకి బానిసై తాళికట్టిన భార్యనే ఎగతాళి చేశారు!

రేపు మళ్ళి ఇంకొక గరల్ ఫ్రెండ్ మత్తు పెట్టదని గ్యారంటీ ఏమిటి?

అసలు పెళ్ళయి "భార్య" అన్న మనిషి ఇంటికి వచ్చాక ఇంకా మరో స్త్రీ ఎందుకు?

"భార్య" అంటే మీ దృష్టిలో "కీ" ఇస్తే ఆడే ఆట బొమ్మ అనుకుంటున్నారు కదా?

కాని ఆడదంటే నా దృష్టిలో ఆత్మాభిమానం గల అమ్మాయి.

ఆమె సున్నితమైన అభిమానం దెబ్బతిన్ననాడు స్త్రీ భర్తనే కాదు ఈ సర్వ ప్రపంచాన్ని ఎదిరిస్తుంది.

అప్పుడు వద్దని నన్ను వెళ్ళగొట్టారు.

ఇప్పుడు తిరిగి రమ్మంటున్నారు.

"మీరు "ఛీ" అంటే పోవటానికి " రా " అంటే రావటానికి నేను మీ పెంపుడు కుక్కని అనుకుంటు న్నారా?

నేను మోటుగా వున్నానన్నారు, నాకు నాజూకు తనం లేదన్నారు, నేను పెద్దగా చదువు కోలేదని, చక్కగా ఇంగ్లీషు మాట్లాడ లేనని గేలి చేశారు.

మీ కోసం మీ ఫ్రెండ్స్ వస్తే తలుపు చాటునుంచి ముసలమ్మలా జవాబు చెప్తానన్నారు.

మీతో పని చేసే మీ లేడి టైపిస్ట్ తియ్యగావుంటుం దన్నారు.

మీ ప్రక్క సెక్షన్‌లో పనిచేసే స్టెనో స్టైయిల్‌గా మేకప్ వేసుకుంటుందన్నారు. మంచి ఇంగ్లీషు మాట్లాడుతుందని అందంగా వుంటుందని పొగిడారు.

నన్ను అడుగు అడుగునా వాళ్ళందరితో పోల్చి హేళన చేశారు.

నేను మొద్దు రాచిప్పనన్నారు. ఫాషన్సు తెలియవన్నారు.

ఎప్పుడూ జిడ్డోడుతూ పనితో వుంటానన్నారు.

అవన్నీ నిజమే కావచ్చు.

కాని భర్తగా నాకోసం మీరు ఏం చేశారు?

నన్ను ఎప్పుడైనా మీతో సర్దాగా నాల్గుచోట్లకి తీసుకు వెళ్ళారా? అలా నల్గురిలోకి వస్తే నాకు మాత్రం ఆపాటి, సోషల్ మూవింగ్ తెలియక పోయిందా?

నన్ను ఎప్పుడూ వంట గదికే పరిమితం చేశారు. పార్టీలని మీటింగుల సంగతి వదిలెయ్యండి మీరు కనీసం నన్ను సినిమాకి కూడా తీసుకెళ్ళలేదు.

నేను ఎప్పుడూ వంటగదిలో జిడ్డు మొహంతో వుంటానని తిట్టేవారు.

అప్పుడు నాకు చిన్నతనం. అమ్మ దగ్గర గారాబంగా పెరిగాను. పనిపాటలు సరిగారావు. కొత్తగా కాపు రానికి వచ్చిన రోజులు, కూర తరగటానికి గంటసేపు పట్టేది. తొందర పడితే వేళ్ళు చీరుకు పోయేవి.

అంట్లగిన్నెలు కడగటం, బట్టలు వుతకటం, వంట... ఇన్ని పన్లతో అలసటగా వుండేది.

అందుకే పనిమనిషిని పెట్టుకుంటానంటే మీరేమన్నారు?

"నువ్వేమన్న ఉద్యోగం చెయ్యాలా వూళ్ళేలా?

ఆడదన్నాక ఆ మాత్రం ఇంటి పని చేసుకోలేకపోయాక ఇంకెందుకు? పనిమనిషికి... ఇరవై రూపాయిలు. అదో దండగ!" అని కదూ అన్నారు.

ఇరవై రూపాయిలే చూశారు.

కాని నా సౌఖ్యం చూశారు కాదు కదా?

బంగారు పళ్ళానికయినా గోడచేర్పు కావాలి అన్నారు పెద్దలు.

ఎంత అందగత్తె అయినా పరిశుభ్రంగా వుంటేనే ఆమె అందం శోభిస్తుంది.


ఎంత అనాకారి అయినా అందంగా అలంకరించుకుంటే మళ్ళీచూడాలి అనిపిస్తుంది.

నిజానికి ప్రతీ స్త్రీలో అంతో ఇంతో అందం వుంటుంది.

**బంగారు పళ్ళాని కయినా గోడ చేర్పుకావాలి అన్నారు పెద్దలు. ఎంత అందగత్తె అయినా పరిశుభ్రంగా వుంటేనే ఆమె అందం శోభిస్తుంది. ఎంత అనాకారి అయినా అందంగా అలంకరించుకుంటేనే మళ్ళీ చూడాలనిపిస్తుంది.**

సృష్టిలో అసలు స్త్రీత్వమే గొప్ప ఆకర్షణ కదా?
నేను మీ కంటికి అందంగా కనిపించక పోవచ్చు.
కాని నేను అనాకారిని కాదు.
ఆ రోజు....
నాకిప్పటికి బాగా గుర్తు.

అవి... మన పెళ్ళయిన కొత్త రోజులు.
అంత వరకు నేను పల్లెటూరిలో పుట్టిపెరిగాను.
నాకు పట్నం అంటే మోజు.



మీ దగ్గరకి వచ్చాక మిమ్మల్ని సినిమాకి తీసుకెళ్ళమని అడుగుదామని రోజూ అనుకుంటూ బిడియంతో ఆగిపోతున్నాను.

ఆఖరికి ఆరోజు "ముహూర్తం" పెట్టుకున్నాను అడగటానికి!

సాయంత్రం కాగానే చక్కగా తలంటి పోసుకుని చిన్న చుక్కలు వున్న తెల్లటి ఆర్గండి చీరలో అందంగా ముస్తాబయ్యాను.

జాజులు దననం కలిపిన పూలదండని జడలో పెట్టుకుని మీ కోసం ఎదురు చూస్తూ కూర్చున్నాను.

ఆ రోజు నేను నిరీక్షించి నట్టే ఆఫీసునుంచి మీరు తొందరగా ఇంటికి వచ్చారు.

ఆ సంతోషంతో గడప దగ్గరే మీకు ఎదురు వచ్చి గారంగా మిమ్మల్ని కౌగలించు కున్నాను.

అప్పుడు...

అప్పుడు మీరేమన్నారు??

నన్ను రెక్కపట్టి దూరంగా నెట్టి, నొసలు చిట్లించి నాకేసి చూస్తూ—

"ఏమిటే అవతారం? భోగం దానిలా?"

"....."

అంతే!

ఆమాటతో నా మనసు చచ్చి పోయింది.

నా అభిమానం చచ్చిపోయింది.

నా సంతోషం, ఆనందం, మీ పట్ల అనురాగం... అన్నీ... అన్నీ చచ్చి పోయాయి. అవమానంతో, సిగ్గుతో తల దించుకున్నాను. నాకు తెలియక అడుగుతాను—

పువ్వులు భోగం వాళ్ళు పెట్టుకుంటారా?

తెల్లచీర భోగం వాళ్ళు కట్టుకుంటారా?

మీ అమ్మా, మీ చెల్లెళ్ళు పూలు ఎప్పుడూ పెట్టుకోలేదా?

తెల్లచీర కట్టుక్కో లేదా?

కాని మా అమ్మ, మా పిన్నిలు, మా మేనత్తలు ఎన్నో సార్లీ పూలు పెట్టుకుని తెల్ల చీరలు కట్టుకున్నారు కదా?

మరి వాళ్ళంత భోగం వాళ్ళు కాదే?

"భార్య" అంటే మీ కెంత చిన్న చూపో నాకు అర్థం అయ్యింది.

నేను స్వతంత్రంగా సంతోషంగా వుండకూడదు. ప్రతీ అడుగూ మీకు చెప్పి వెయ్యాలి.

"భర్త"ని అన్న మగవాడి అహంకారం తప్ప అనురాగం ఆప్యాయత నాకు ఎన్నడు మీ దగ్గర కనిపించలేదు.

పైగా నేను సరదాగా సరసంగా వుండనన్నారు.

అసలు "సరసం" అంటే ఏమిటి మీ దృష్టిలో...

నా చిన్నతనంలో మా ఇంటి పక్క వాటాలోకి కొత్తగా పెళ్ళయిన జంట కాపురానికి వచ్చారు.

అతను చాలా అందంగా వుండేవాడు. ఫారెస్టు డిపార్టుమెంటులో ఉద్యోగం.

అతని భార్య చామన చాయలో పొడుగ్గా బక్కగా వుండేది.

అందంలో అతని ముందు తీసికట్టు. కాని అత్తకూతురు అన్న మమకారంతో ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడుట!

ఆమె పేరు సుగుణ. చాలా ప్రేమగా చూసేవాడు.

ఆవిడ రోజూ సాయంత్రం కాంగానే స్నానం చేసి, ఇస్త్రీ చీర కట్టుకుని, తల నిండా పూలు పెట్టుకుని భర్తకోసం ఎదురు చూస్తూ కూర్చునేది.

ఆవిడ ఒంటికి ఏం రాసుకునేదో నాకు తెలియదు.

కాని చందనం, మొగలి రేకులు, సంపంగలు, సన్నజాజులు... ఇల్లాంటి ఘాటయిన మత్తు పరిమళం ఆవిడ మీంచి గుభాళించేది.

భర్త రాగానే వీధి తలుపులు పెట్టుకునేవారు.

వాళ్ళిద్దర్నీ చూస్తే నాకెందుకో చాలా ముచ్చట అనిపించేది. చాలా అన్యోన్యంగా వుండేవారు.

అప్పుడు నాకనిపించేది.

నాకు పెళ్ళి అయ్యాక, నేను కూడా అలాగే అలంకరించుకుని నా భర్త కోసం ఎదురు చూడాలి. అతని అనురాగాన్ని పొందాలి అని!

నాలోని ఆ ప్రగాఢమైన కోర్కెకి ఆరోజు రూపకల్పన చేశాను.

ఒక విధమైన. ఆపేక్షతో ఉద్వేగంతో మిమ్మల్ని కౌగలించు కున్నాను.

కాని. మీరు...?

నా హృదయంలో కంటకాల్ని గుచ్చారు.

సరిగ్గా అదే క్షణంలో నిర్ణయించుకున్నాను.

ఇంకెప్పుడు మీకోసం అందంగా ప్రత్యేకంగా అలంకరించు కోకూడదని, మీ రాక కోసం అసలే ఎదురు చూడ కూడదని!

ఏ మాత్రం "రసికత' తెల్సిన మగవాడైనా భార్యకోసం చిన్నచిన్న కానుకలు తెస్తాడు. చీరలు, అలంకరణ సామాగ్రి, పూలు, సెంట్సు.... ఇలా...

కాని మీరు నాకోసం ఎప్పుడైనా చిన్న కానుక తీసుకొచ్చారా? లేదు.

అయినా వున్నంతలో నాకుగా నేను మీకోసం చక్కగా అందంగా అలంకరించుకున్నాను.

ఆ అందాన్ని ఆస్వాదించటం కూడా మీకు చాతకాలేదు.

అయితే ఆ తరువాత నాకు తెలిసింది.

నాపట్ల మీ నిర్లక్ష్యానికి దురుసు ప్రవర్తనకి కారణం...

మీరు అప్పటికే దుర్వ్యసనాలకి బానిస అయ్యారని, పర స్త్రీ వ్యామోహంలో చిక్కుకున్నారని, ఆ దారి నుంచి మిమ్మల్ని మళ్ళించటానికే పెళ్ళి చేశారని!

మీ పెద్దలు మన పెళ్ళి అయితే జరిపించారు. కాని మీ చేత భార్యని ప్రేమించేలా మాత్రం చెయ్యలేక పొయ్యారు.


ఆఖరికి మన పెళ్ళయిన రెండేళ్ళకే మీరు నాకు విడాకులు ఇచ్చారు.

అప్పుడు నా వయస్సెంతని? పద్దెనిమిది సంవత్సరాలు!

నేను పల్లెటూరి దాన్నని, నావల్ల మీకు సుఖం లేదని, నా చరిత్ర మంచిది కాదని నా మీద అన్యాయంగా అభాండాలు సృష్టించారు.

నేను మీ కాళ్ళు పట్టుకున్నాను. కన్నీటితో మీ పాదాలు అబిషేకం చేశాను. మీ ఇంట్లో పనిమనిషిగానైనా బ్రతకినియ్యమని ప్రాధేయ పడ్డాను. అగ్ని సాక్షిగా నేను మీ భార్యనని మెళ్ళో తాళి బొట్టు చూపించాను.

కాలితో బంతిని విసిరినట్లు తన్నారు.



కుంభకోణం

మంత్రి మర్తాండం గారి దగ్గర కొచ్చాడు పెళ్ళిళ్ళ పేరయ్య.

"అయ్యా? వరుడు కలెక్టరు. ప్రస్తుతం కుంభకోణంలో వున్నాడు" అన్నాడు పేరయ్య.

"సిమ్మెంటు కుంభకోణంలోనా?" సాలోచనగా అడిగాడు మంత్రి మార్తాండం.

"అబ్బే... ఆడూళ్ళో..." చెప్పాడు పేరయ్య.

—కె.వి.సత్యనారాయణ మూర్తి (కొండసముద్రం)

విద్వారం — వేళాం.





భయం వద్దు

"అన్నం గిన్నె కింద వుంది. అటు చూస్తుండండి. ఇప్పుడే వస్తాను" అంది అరుణ, భర్త శీనుతో.

"నీకా భయం అక్కర్లేదు. ఆ అన్నం నేను తప్ప ఎవరూ తినరులె..." అన్నాడు పేపరు చదువుకుంటూ శీను.

—కె. ప్రసాద్ (గుంటూరు)

హీనంగా నా మెడపట్టి గెంటారు.

నా మొహం చూడటానికి మీకు అసహ్యంగా వుందన్నారు. నేను భోగం దానిలా అలంకరించు కుంటానని, ఎవరి కోసమో ఎదురు చూస్తానని, నా శీలం మంచిది కాదని నాపై అపవాదులు మోపారు.

కాని నేను అప్పటికి ఇప్పటికి మంచిదాన్నే.

పల్లెటూరి అమాయికత, ఆత్మీయత నా సొత్తు.

నేను తెల్లచీర కట్టుకున్నది, మల్లెపూలు పెట్టుకున్నది, ఎదురు చూసింది మీ కోసమే.

ఆ విషయం మీకు తెల్సు

కాని మీరు మీ ప్రేయిసి సోఫియా పాదాలకి దాసోహం అయి ఆమె ఆజ్ఞ మేరకి నాకు విడాకులు ఇచ్చారు.

అప్పుడు నేను అబలని. మెరుగు పెట్టని వజ్రాన్ని.

కాని ఇప్పుడు సబలని. మీ తిరస్కృతితో నాలో అభిమానం తల ఎత్తింది. ఆ ఓటమిలోంచే గెలుపు సాధించాను.

మీరు నన్ను ఒదిలిపెట్టే నాటికి మా నాన్న చనిపోయాడు. కాని మా చిన్నన్న కొడుకు బద్రినాథ్ నాకు అన్ని విధాల అండగా నిలిచి ధైర్యం చెప్పాడు.

మా అమ్మ ఒంటి మీద వున్న నగలు, ఆవిడ పేర్న వున్న కొద్ది పాటి ఆస్తి అన్ని అమ్మి మెడిసిన్ చదివాను.

ఒక చెంప కన్నీరు రాలుస్తూ అహోరాత్రులు కష్టపడ్డాను.

డాక్టరు పట్టా పుచ్చుకున్న రోజు నేను ఎంత ఆనందించానో.... మొట్ట మొదటి సారి చంద్రమండలం పై కాలు మోపిన నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ కూడా బహుశా అంత ఆనందించి వుండడు!

పట్నవాసంతో నాజూకు తేలాను.

అందంగా ఫాషన్‌గా అలంకరించు కుంటున్నాను స్టైయిల్‌గా ఇంగ్లీషు మాట్లాడుతున్నాను నాకో— డాక్టర్సుతో సోషల్‌గా మూవ్ అవుతున్నాను. డాక్టరుగా బోర్డు పెట్టి సంపాదిస్తున్నాను.

ఇప్పుడు మీకు నన్ను చూస్తే కన్ను కుట్టింది.

మీ చేతి నుంచి జారిపోయింది గులకరాయి కాదని, మెరుగు పెట్టని వజ్రపు తునక అని తెల్సింది.

అందుకే నావెంట పడుతున్నారు.

నాపై లేని ప్రేమ నటిస్తున్నారు.

నేను నా కో డాక్టరు మోహన్ని పెళ్ళి చేసుకోబోతున్నానని తెల్సి ఈర్ష్య పడుతున్నారు.

మన సంగతి అతనికి చెప్పేస్తానని నన్ను బెదిరిస్తున్నారు. నా 'క్యారక్టరు' మంచిది కాదని అతనికి ఆకాశ రామన్న ఉత్తరాలు రాస్తానంటున్నారు.

నాకు మిమ్మల్ని చూస్తుంటే "నవ్వు" వస్తోంది. జాలికూడా వేస్తోంది.

నా గతం అంతా దాచి మోహన్ని మోసం చేశానని అనుకుంటున్నారు కదా? కాదు.

మేమిద్దరం మంచి ఫ్రెండ్సు.

అతను తరచూ మా ఇంటికి వచ్చేవాడు. తన మనో భావాల ద్వారా నాపట్ల ప్రేమ, అనురాగం వ్యక్తం చేసేవాడు.

అలాంటి సందర్భంలోనే ఒకసారి అతనికి "నా కథ" చెప్పాను.

నిశ్శబ్దంగా అంతా విని.

"మరి మీరు మళ్ళీ ఎందుకు పెళ్ళి చేసుకోలేదూ?" అన్నాడు.

"ఈ పరిస్థితిలో నాకు పెళ్ళేమిటి?" అన్నాను విరక్తిగా.

"ఏం? అదే మగవాడయితే చేసుకోడా? మీరు మాత్రం ఎందుకు చేసుకోకూడదు?" అన్నాడు.

"నిజమే. నేను జీవితంలో సుఖపడింది ఏమీ లేదు. చేసుకోకూడదు అని కాదు. కాని నన్ను ఎవరు చేసుకుంటారు?" అన్నాను.

"నేను. నేను చేసుకుంటాను శాంతీ. ప్రామిస్" అంటూ చప్పున నా చేయి అందుకున్నాడు.

అతని కళ్ళల్లోని సిన్సియారిటీ నన్ను కదిలించింది.

ఒప్పుకున్నాను.

మేమిద్దరం ఏదో తొందర పాటుతో చేసుకున్న నిర్ణయం కాదది.

నాల్గు సంవత్సరాలు ఇద్దరం కల్సి చదువుకున్నాము.

ఒక సంవత్సరం ఒకే హాస్పిటల్‌లో కల్సి పని చేశాము.

అతరువాత ఏడాదిన్నర పాటు దూరంగా వుండి పల్లెటూళ్ళకి వెళ్ళి ఉద్యోగాలు చేశాము. ఇప్పుడు ఇద్దరం తిరిగి సిటీకి వచ్చి ప్రాక్టీసు పెట్టాము. అతి త్వరలోనే మా వివాహం.

ఇన్నాళ్ళ అనుబంధం మీదటే ఒ కళ్ళ నొకళ్ళం బాగా అర్ధం చేసుకున్న తరువాత పెళ్ళి చేసుకోవాలి అన్న నిర్ణయానికి వచ్చాము.

మా నిర్ణయంలో తొందర పాటు ఆవేశం లేదు.

మా ఈ ఆరు సంవత్సరాల పరిచయంలో మోహన్ నన్ను ఒక్కసారి కూడా ఛీత్కరించుకోలేదు. నా మనసు నొప్పించ లేదు.

నేను కట్టుకున్న చీర బాగుండక పోతే—

"శాంతీ! ఈ కలర్ నీకు మాచ్ అవలేదు. కొంచెం లైట్ కలర్ అయితే బాగుంటుంది" అంటాడు మృదువుగా.

నేను ఎప్పుడయినా అలసటలో స్నానం చెయ్యకుండా అపరిశుభ్రంగా వుంటే —

"శాంతీ! నేను కాస్సేపు కూర్చుంటాను. ను వెళ్ళి స్నానం చేసిరా. చూడు...చిన్న ప్రింటుతో వున్న వైట్ కాటన్ చీర కట్టుకుని రా. నా కిష్టం" అంటాడు.

"అంతేగాని మీరు తిట్టినట్టు మొద్దురాచ్చిప్పవని, అంట్ల మొగం అని నన్ను తిట్టడు.

నేను ఎలా మేకప్ చేసుకుంటే అతని కంటికి అందంగా అగుపిస్తానో నన్ను అలా మేకప్ చేసుకోమని కోరతాడు.

మేమిద్దరం కల్సి వున్నప్పుడు అతనికి నచ్చిన డ్రెస్ వేసుకుంటాను.

మిగత సమయాల్లో నాకు నచ్చిన డ్రెస్ వేసుకుంటాను.

మగవాడి ప్రతిభ ఎప్పుడు రాణింపుకి వస్తుందంటే స్త్రీని తనకి నచ్చిన రీతిగా మలుచుకున్నప్పుడు.

కాని మీకు ఆ ప్రతిభ లేదు.

పరాయి ఆడపిల్లల్లో తప్ప కట్టుకున్న భార్యలో అందాలు చూడలేని అవివేకి మీరు.

భార్యల్ని అదుపు చేస్తున్నా మనుకుని ఆమెకి ప్రేమా, ఆనందాల్ని ఇవ్వకుండా, డబ్బుకి ప్రేమ నటించే గరల్ ఫ్రెండ్సుని నెత్తి కెక్కించుకునే మీ లాంటి వాళ్ళకి, చివరికి బతుకు మీలాగే నేల పాలు అవుతుంది.

ఆకుకి అందక పోకని చెందక "నా" అనుకున్న వారు లేకుండా ఏకాకిగా మిగిలిపోతారు.

రామాయణం ఒక మహా కావ్యం. ఆ కావ్యాన్ని తీసుకెళ్ళి ఒక పండితుడి చేతుల్లో పెడితే, అతడు ఆ కావ్యాన్ని చక్కగా చదివి, అర్ధం చేసుకొని ఆనందిస్తాడు. అంతేకాక ఆ కావ్యం యొక్క గొప్పతనాన్ని లోకానికంతటికి చాటి చెప్పతాడు.

కాని అదే కావ్యాన్ని తీసుకెళ్ళి ఒక అపండితుడి చేతుల్లో పెడితే అతనికి ఆ కావ్యం ఒక్క ముక్క కూడా అర్ధంకాక నిర్లక్ష్యంగా పక్కకి పడేస్తాడు. ఆ గ్రంథం బూజు పట్టి, చెదలు పట్టి క్రమంగా శిథిలం అయిపోతుంది. నామరూపాలు లేకుండా నశించిపోతుంది.

పండితుడి చేతుల్లోనూ అదే కావ్యం.

అపండితుడి చేతుల్లోనూ అదే కావ్యం కాని ఆ గ్రంథాన్ని అర్ధం చేసుకునే గొప్పతనం అంత పాండిత్య ప్రతిభలో వుంటుంది.

మీరు అ పండితుడు. అవివేకి. అందుకే మీరంటే నాకు అసహ్యం.

ఆఖరిసారి మర్యాదగా చెప్తున్నాను.

ఇంకెప్పుడూ నా చాయలకి కూడా రావాలని ప్రయత్నించకండి. మీ ముఖం చూడటమే కాదు మీ తలంపే నాకు ఏవగింపు.

ఇంకొకసారి నన్ను ఏరకంగా నైనా ఇబ్బంది పెట్టినా నా దారికి అడ్డం వచ్చినా మా మోహన్‌కి చెప్పి మీ పై పోలీస్ కంప్లేంటు ఇస్తాను.

మా అన్నయ్య వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ — బద్రినాథ్‌కి చెప్పి మీకు మరచిపోలేని విధంగా బుద్ధి చెప్పిస్తాను. ఏ మాత్రం వివేకం వున్నా ఇంకనాకు మీ మొఖం చూపించకండి. శెలవ్.

— డా. శాంతి

*